35. మీ మీ సమస్యలను ఈ గుండెమీద చెక్కండి ! నా ఊపిరిని మీ శ్వాసగా పీల్చండి !

36. అనాదిగా వ్యక్తికీ వ్యవస్థకూ మధ్య జరిగే సంఘర్షణకు పోరాటమే పునాది. వ్యవస్థ మార్పుకు సమిష్టిశక్తి పునాది.

37. ఈజ్యమునకు నా మరణమైతే రేపటి నా జననమే 'సంచలనమ్'.

38. యిజాల కాపిటలిజాన్ని ఎదుర్కొనే నిజాల సోషలిజం నాది.

39, సమైక్యజీవనం ప్రాథమిక హక్కు. సమైక్యపోరాటం సామూహిక హక్కు.

40. ఈ మనుషులకోపం, హక్కులకోసం ఆలోచించేవాళ్ళు పోరాటానికి సిద్ధం కండి !

41. ఇచ్చట బలైపోయేది న్యాయంకోసం బతుకుతున్న వాళ్లు, ధర్మాన్ని బతికించేవాళ్ళు.

42. ఆకలి శకటాలమధ్య పిడికిలి బిగించే మానవతాప్రభంజనం తిరుగుబాటు.

43. వ్యక్తులను పీడించేవాళ్ళు వ్యవస్థను సంస్కరించలేరు.

44. ఆకలిశక్తి ఎరిగిననాడు ఉద్యమంలో పోరాడగలరు.

45. నువ్వు తాళికట్టే కళ నేను తలవంచేది నీపై భక్తితో కాదు. నీకు వినయం నేర్పటానికే ?

46, తాటాకు గుడిసెల్లో మనకు మిగిలేవి తాళపత్ర జీవితము మాత్రమే.

47. క్రౌర్యానికి దైన్యం జవాబు కాదు.

48, తిన మరిగినవాటికి కడుపును పెంచుతుంది 'లంచం'

49. కష్టాల అధ్యాయంలో కన్నీళ్ళను ఇంకించుకునే శిల ఉపాధ్యాయిని.

50, ముక్తికోసం, విముక్తికోసం, విశ్వశాంతికోసం, క్రాంతికోసం, ననేక స్వర్గనిర్మాణానికి, పయనం కట్టిన మహర్షి శ్రీ శ్రీ. ముందడుగువేసిన మహాత్ముడు శ్రీ శ్రీ.

—సేకరణ : శ్రీమతి సత్యాదేవి.

# "ఫ్రెండు ఎవరు?"

రచన : శ్రీ ఎ. కనకరాజు

రైల్వేస్టేషన్ లో :

'....ఒకటవనెంబరు ప్లాట్ ఫారమ్ నుండి పదినిముషములలో బయలుదేరనున్నది' మైకులో అనౌన్సుమెంటు వినబడింది.

ప్రయాణీకులు హడావుడిగా అటూ ఇటూ పరుగెడుతున్నారు. 'ఎవరికివారే యమునాతీరే' అన్నట్టు ఒకరిగోల మరొకరు పట్టించుకోవడం లేదు.

లైసెన్సు కూలీలు లాగుచూవుండే సామానులబండి 'ట్రాలీ' జనాన్ని కంగారు పెట్టిస్తోంది.

'చాయే గరమ్', 'చినియా బదామ్' అని అమ్మకందారులు గొంతు చించుకొని అరుస్తున్నారు.

'కూ' అని హెచ్చరించింది రైలు.

నలభై సంవత్సరాల పరంధామయ్య జుట్టు అక్కడక్కడ నెరిసిపోయింది. కిటికీవద్ద కూచొని బెదిరిపోయిన చీమల్లా కదులుతూన్న జనాన్ని చూస్తున్నాడు.

అతనికి ముప్పైఏళ్ళు వుండవచ్చు. పైకి దువ్విన నొక్కుల జుట్టు, పొడుమురంగు ప్యాంటులోకి దోప్పుకొని పోయిన తెల్లని లాల్చీ, హవాయా చెప్పులు. అతన్నిచూస్తే పెద్దకుటుంబంనుంచి వచ్చిన విద్యావంతుడిలాగా వున్నాడు.

రుమాలుతో సీటు దులుపుకొని పరంధామయ్య ఎదురుగా కూచున్నాడు చేతిలోవున్న 'బ్రీఫ్ కేస్' ప్రక్కన పెట్టుకున్నాడు.

ఒకసారి ఇద్దరూ ఒకరినొకరు చూసుకొని నెవరిధ్యానంలోకి వాళ్ళు వెళ్ళిపోయారు.

గార్డు 'ఈల' వేశాడు.

'సామాన్లు జాగ్రత్త. మరీ మొద్దునిద్రపోకుము. మర చెంబుతో కలిపి మొత్తం ఎనిమిది' ఎవరో అప్పగింతలు పెడుతూవుండగా మరోమారుకూడ కూసి కదిలింది రైలు.

రైలు ప్లాటుఫారం దాటేసరికి చాలావరకు గోల తగ్గింది.

ఎవరిసీట్లలో వాళ్ళు కూచున్నారు.

చేతిలోవున్న పత్రిక విప్పి చూడటం మొదలుపెట్టాడు యువకుడు.

రైలు వేగం పుంజుకుంది.

బయట ప్రకృతినేతప్ప పెట్టెలో తనచుట్టూ వున్న వాళ్ళని గమనించని పరంధామయ్య కాలికి యువకుడికాలు తగిలింది.

'సారీ!' పత్రిక ప్రక్కన పెడుతూ అన్నాడు యువకుడు.

'నెవ్వర్ మైండ్' అంటూ పెట్టెలోకి బుర్ర తిప్పాడు పరంధామయ్య.

ఒంటరితనం ఒకశిక్ష, పదిమందిలో వుంటూకూడా తను ఒక్కడే. మిగిలినవాళ్ళు అలా లేరు. ఏవో మాటలు, నవ్వులూ, కేరింతలు - ఇంట్లో వున్నట్టే వుంది వాళ్ళ ప్రవర్తన. అది రైలని, వాళ్ళు ప్రయాణికులనీ, గమ్యం కోసం ఎదురుచూడాలని వాళ్ళనుకుంటూన్నట్టు లేదు.

బోరు కొట్టేస్తోంది పరంధామయ్యకి.

'వైజాగా?' నవ్వుముఖంలో పరంధామయ్యని ప్రశ్నించాడు యువకుడు.

'కాదు, విజయవాడ' గొంతు సవరించుకొని బదులిచ్చాడు పరంధామయ్య.

'బిజినెస్ చేస్తున్నారా?'

'వ్యవసాయం చేస్తున్నాను.'

ఆ ప్రశ్న పరంపర పరంధామయ్యని విసిగించడం లేదు.

ఏదో స్టేషన్‌లో రైలాగింది.

కొందరు దిగారు, కొందరెక్కారు. దిగినవాళ్ల చోటు అంతసేపూ నిలబడ్డవాళ్ళు భర్తీ చేశారు.

రైలుకి, మనిషికి దగ్గర పోలికలున్నాయి. జీవితంలో కొన్ని అనుభవాలు జారుకుంటే కొత్త అనుభవాలు చోటు చేసుకుంటాయి. కొన్నిమాత్రం చెరగని ముద్ర వేస్తాయి.

'బాబయ్యా!' కిటికీకిదగ్గరగా చెయిచాచి అర్థిస్తున్నాడొక బిచ్చగాడు.

తైలసంస్కారంలేని జుట్టు, ధూళి కొట్టుకుపోయి అస్తవ్యస్తంగా వుంది. మాసినగడ్డం, లోతుకుపోయిన కళ్ళు, ఆకళ్ళచే సాగరమధ్యంలో ఈతకొట్టేకంటే మునిగిపోవడమే మంచిదనిపిస్తూన్న నిరాశా, నిస్పృహ, జీర్ణవస్త్రాలతో తనవంకే దీనంగా చూస్తూన్న అస్థిపంజరాన్నిచూసి నిట్టూర్పు విడిచాడు పరంధామయ్య.

లేదనలేక మొహం తిప్పేసుకున్నాడు.

తన నెవ్వరూ పట్టించుకోరు. అడ్డు తగిలితేనే పరికించి చూస్తాడు మనిషి. కలలోకూడ అపకారం తలపెట్టని తనను చూసి ఏవగించుకుంటూ రెండుకో? గొణుక్కొంటూ జేబిలో కర్రని దాటించుకొంటూ తొలగిపోయాడు భిక్షకుడు.

రైలు కదిలేసరికి బిచ్చగాడిని అదేపనిగా చూస్తూన్న యువకుడు పరంధామయ్య నుద్దేశించి 'ఎక్కడచూసినా వీళ్ళే' మొహం చిట్లించుకుంటూ అన్నాడు.

'ఇప్పటికి కనీసం పదిమందికైనా ఇచ్చివుంటాను.'

ఒక్కటన్నుబరువు లేపనెత్తుతూన్నట్టు చేయిపైకెత్తుతూ చెప్పాడు పరంధామయ్య.

'ఇంతకీ ముష్టివాడంటే జాలిపడటం దేనికి? తేరగా వస్తే తెల్లవార్లూ తింటారు. నొప్పి ఏభావులేని వృత్తి మన జేబులు వాళ్ళబ్యాంకులు! కష్టపడ్డా కడుపునిండని కష్టజీవి పట్ల కనికారం, సానుభూతి చూపిస్తే పదిమందీ హర్షిస్తారు.

'బాబయ్యా! నన్ను నువ్వు పోషించు, నేను కాళ్ళు చాచుకొని కూచుంటాను' ఇదేకదా ముష్టివాళ్ళ ఆంతరం. అవిటివాడు అర్థిస్తె అర్థం వుంది. కుంటివాడో, గ్రుడ్డివాడో విధి వెక్కిరించగా యాచిస్తే దాతకి పుణ్యం, పురుషార్థమూను, దేవుడు మెచ్చుకుంటాడు. మా నాన్నగారు....'

'మీ నాన్నగారు ఏం చేస్తూవుంటారు?' యువకుడిమాటల కడ్డొచ్చాడు పరంధామయ్య.

'మీరు నమ్ముతానంటే నాగురించికూడా చెబుతాను.'

ఇంతలో 'లింకా' అండీ అంటూ అమ్ముకొనేవాడు అంతరాయం కలిగించాడు.

'ఆ! రెండు లింకా లియ్యి' జేబులోంచి పర్సుతీస్తూ అన్నాడు యువకుడు.

'నాకొద్దు నాదగ్గర చిల్లరలేదు.'

పరంధామయ్య అభ్యంతరాన్ని త్రోసిపుచ్చేస్తూ 'నాదగ్గరుందిలెండి. అక్కరకు రానిడబ్బు దేనికి?' ఔదార్యం వుట్టిపడేమాటలతో అన్నాడు యువకుడు.

పదిరూపాయల కాగితం కుర్రాడి కందిస్తూ 'చిల్లరుందా' అన్నాడు.

'లేదండి.'

'సరే! చిల్లరకూడేక ఇచ్చి మరీ వెళ్ళు' యువకుడి మాటలకి తలూపుతూ వెళ్ళిపోయాడు కుర్రాడు.

రైలు కదులుతూనే వుంది.

యువకుడి వైఖరికి ఆశ్చర్యపోతూ, 'ఆడబ్బులు పట్టుకొని ఉడాయిస్తే?' అని అనుమానం వ్యక్తంచేశాడు పరంధామయ్య.

'యద్భావం తద్భవతి' అంటారు. ఎక్కడికి పోతాడు. మనసే మనిషికి సాక్షి. దానినుంచి తప్పించుకుపోలేడు. మనసు పట్టించుకుంటే చితిని చేరేవరకూ వెంటాడుతుంది మనిషిని. పోతే పోనీండి. పదిరూపాయలేగా ! ఆర్జించడం చేతకాకపోతే పైసాకూడా మేరుపర్వతంలాగా కనబడు తుంది. రోజుకి వందరూపాయలు ఆర్జించగలను. అవసరం అవిపిస్తే ఐదువందలు ఖర్చు చేస్తాను !

యువకుడిమాటలు వింటూంటే బంగారు పిచ్చుకలోంచి బంగారమే బయట పడుతోందనిపించింది పరంధామయ్యకి.

'మీ మాటలు వింటూంటే మీ నాన్నగార్నిగురించికూడా తెలుసుకోవాలని వుంది' కుతూహలంగా అడిగాడు పరం ధామయ్య.

'ఓ ! మరిచాను. డాక్టరు కాకాపేరు విన్నారా ?'

'వినకేం ? జీవితాన్ని ప్రజాసేవకి అంకితం చేసిన నిస్వార్థ జీవి.'

'నేడో రేపో మినిష్టరు కాబోతున్నారు. ఆయనే మా నాన్నగారు. నేను వుద్యోగంచేస్తే ఆయన ఒప్పరు. అంతా నాపట్ల పక్షపాతం చూపిస్తారట. మా చెల్లాయి పెళ్ళి విష యంకూడా తేల్చడంలేదు, పెద్దవాళ్ళ కడుపున పుట్టడం ఒక శాపం అనిపిస్తోంది.' యువకుడు చెప్పుకుపోతూ వుండగా పొగలు, సెగలు కక్కుతూన్న రైలుబండి స్టేష న్‌లో దిగింది.

మాటలాపేసి లేచి నుంచున్నాడు యువకుడు, హడా వుడిగా.

'నేనిప్పుడే వస్తాను. స్టేషనుమాష్టారికి కొన్ని కాయితా లివ్వమన్నారు నాన్నగారు. నాసీటులో మీబ్యాగు వుంచండి.'

'మాస్టారు దగ్గరగా. నాకో చిన్న వుపకారం చేసి పెట్టండి. ఇదిగో ఈ వందరూపాయలనోటుకి చిల్లర కాయి తాలు తెచ్చిపెట్టాలి. మీకయితే కాదనరు.' వెళ్ళబోతున్న యువకుడిచేతికి వందరూపాయలనోటు అందిస్తూ అభ్యర్థిం చాడు పరంధామయ్య.

'ఇదో పెద్దవనా !' నోటుతీసుకొని బండి దిగాడు యువ కుడు.

బ్యాగు తప్పించి యువకుడిసీటులో కూచున్నా డొక పెద్దమనిషి.

'సారీ ! అది నా ఫ్రండుసీటు' పరంధామయ్య అభ్యం తరం చెప్పాడు.

'మీ ఫ్రండు వస్తే సర్దుకొని కూచుంటాం.'

'అతను మనలాంటి సామాన్యుడు కాదు. డాక్టరు కాకా గారబ్బాయి !' పరంధామయ్య మాటలతో గౌరవభావం పుట్టిపడింది.

పెద్దమనిషికి కనుబొమలు ముడిపడ్డాయి.

'ఏమిటి మీరంటూన్నది ? మావూరి డాక్టరు కాకాగారికి పిల్లలే లేరసలు.'

'ఆ !' ఉలిక్కిపడ్డాడు పరంధామయ్య.

కదిలినరైలు కుదుపులో కలిసిపోయింది అతని కంపనం.

## — తేడా —

లేనివాడు
దొర్లుతున్నాడు
కాలే కడుపుతో
తినడానికి లేక,
ఉన్నవాడు
దొప్పుతున్నాడు
ఉబ్బిన కడుపుతో
తిన్నది అరగక,
ఆనాడు—
అభ్యుదయమే
ఆదర్శంగా
పాటుబడ్డది
నూటికొక్కడు
ఈనాడు—
దోచుకోవడమే
ఆశయంగా
లేని మిహాత్ముడు
కోటికొక్కడు.

—బిచ్చు వీర్రాజు.